
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 61.479 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం 61.749 టీఎంసీల నీరుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1174 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.88,960
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,035
3 శాతం జీఎస్టీతో	రూ.8,276
నవర (8 గ్రా)	రూ.66,208

గరిష్టం/కనిష్టం
33.4 /23.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం గురువారం సాధారణంగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ బుధవారం 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా రీసర్వే చేయండి



రీసర్వే ప్రక్రియను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

సంగం: మండలంలోని కొరిమెర్ల కండ్రికలో జరుగుతున్న రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జేసీ కె.కార్తీక్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. బుధవారం రీసర్వే జరుగుతున్న తీరును పరిశీలించి, తహసీల్దార్ సోమ్లానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ భూములకు సంబంధించిన రైతులతో మాట్లాడారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద 35 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. భూములకు సంబంధించిన పట్టాదారులకు నోటీసులు అందజేసి రీసర్వే ప్రక్రియను జరపాలన్నారు. జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, డీఎస్ఎల్ఓ నాగశేఖర్, సర్వేయర్ శివరంజని, ఆర్ఐ సల్మా, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓగా మల్లికార్జునరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఐటీడీఏ పీఓగా మల్లికార్జునరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆయనకు అడిషనల్ డైరెక్టర్‌గా తాత్కాలిక పదోన్నతిని కల్పిస్తూ నెల్లూరు ఐటీడీఏ పీఓగా ఉత్తర్వులను ఇచ్చారు.

నేడు లంకా దినకర్ రాక

నెల్లూరు(అర్బన్): ఇరవై సూత్రాల ఆర్థిక కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ గురువారం రాత్రి నెల్లూరుకు వస్తారని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ డీడీ సదారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ జిల్లా అధికారులతో 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారన్నారు.

డాక్టర్ విజయకుమార్ రాక రేపు

మాల సంక్షేమ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ ఈ నెల 21న నెల్లూరుకు చేరుకుని రాత్రికి ఇక్కడే బస చేస్తారు. 22వ తేదీ సంబంధితశాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తారు. అనంతరం కలెక్టర్‌తో సమావేశమవుతారు.

ఆర్పీ సిసోడియా రాక రేపు

రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా శుక్రవారం నెల్లూరుకు రానున్నారు. అధికారులతో రెవెన్యూ సమస్యలపై చర్చిస్తారు.

మితిమీరిన టీడీపీ నేతల అరాచకాలు

- ప్రజా సంక్షేమం గాలికి
- అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మేస్తున్నారు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ధ్వజం



నెల్లూరు (వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో టీడీపీ నేతల ఆగడాలు, అరాచకాలు ఎక్కువయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని విమర్శించారు. నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోలార్ విద్యుత్ పేరుతో ఒప్పందం చేసుకుని రైతుల నుంచి తీసుకున్న భూములను అదానీకి కట్టబెట్టిందని, ఇది చాలదన్నట్టుగా యాక్సిస్ ఎనర్జీ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుని యూనిట్ విద్యుత్‌ను రూ.4.23 కొనేందుకు సిద్ధపడిందన్నారు. ఈ ఒప్పందంలో భారీగా ముడుపులు దండుకున్నారని ఆరోపించారు. దేవాలయాలను వ్యాపార కేంద్రాలుగా చూస్తూ హిందూ మతాన్ని కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలోని రిమ్స్‌లో రేడియాలజీ విభాగంలో మతం ప్రాదిపదికన నియామకాలు జరపాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ మూతపడిన కారణంగా 400 మంది ఉద్యోగులు వారి కుటుంబాలు వీధిన పడ్డాయని, వారికి చెల్లించాల్సిన రూ.23 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్లను టీడీపీ నేతలు నరికి విక్రయాలు సాగిస్తున్నా.. అధికారులు, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వరికుంటపాడు అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్లను నరికిన విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులపై దాడి చేసిన టీడీపీ మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అజయ్‌కుమార్, వెంగయ్య, మంగళి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



కేసులు పెట్టండి.. రికవరీలు పెంచండి

రాజీనామా చేయండి

- దగదర్తి, కావలి ఎఫ్‌ఏలకు హెచ్చరిక
- సోషల్ ఆడిట్లో క్లీన్‌చిట్ ఉన్నా.. రూ.లక్షల్లో రికవరీకి సిఫార్సు
- ఆ ప్రజాప్రతినిధి ఆదేశాలను అమలు చేస్తున్న క్లస్టర్ ఏపీడీ
- నలుగురు ఎఫ్‌ఏలు రాజీనామా.. ఆరుగురు సస్పెన్షన్
- కోర్టుకెళ్లిన వారికి బెదిరింపులు, వేధింపులు

నెల్లూరు (పొగతోట): అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజాపాలన గాలికి వదిలేశారు. అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారు. 'తామెలా దోచుకోవాలి.. తమ పార్టీ కార్యకర్తలకు ఏ విధంగా దోచి పెట్టాలి' అనే రీతిగా వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ అభిమానులే లక్ష్యంగా బెదిరింపులు, వేధింపులతో కాలక్షేపం చేస్తున్నారు. ప్రభుత్వ వ్యవస్థల్లో పచ్చ నేతలను పెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. పిచ్చుకలపై బ్రహ్మాస్త్రంలా 'ఉపాధి' శాఖలో ఏళ్ల తరబడి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని వేధిస్తున్నారు. రాజీనామా చేసి వెళ్తారా? కేసులు పెట్టించమంటారా? అని ఓ వైపు బెదిరిస్తూనే.. మరో వైపు కేసులు పెట్టండి, క్లీన్‌చిట్ ఉన్నా.. రూ.లక్షలో రికవరీ విధించమంటూ ఆదేశాలు జారీ చేస్తూ అరాచక పాలన సాగిస్తున్నారు.



ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడుతున్న అధికారి(ఫైల్)

కూటమి ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధుల్లా కాకుండా 'పచ్చ' మంద ప్రతినిధుల్లా వ్యవహరిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిపక్ష పార్టీ నేతలు, ఆ పార్టీ మద్దతుదారులపై దాడులకు తెగబడుతున్న వీరు.. చివరికి 'చిరు ఉద్యోగాలతో' కుటుంబాలను పోషించుకుంటున్న వారిపై కత్తి కట్టి వేధిస్తున్నారు. ఆయా ఉద్యోగాల్లోకి అధికార పార్టీ కార్యకర్తలను చొప్పిస్తున్నారు. బతుకుదెరువు పోతుందని ప్రజాస్వామ్యబద్ధంగా న్యాయస్థానానికి వెళ్లిన వారిపై వేధింపులకు పాల్పడుతున్నారు. వీరి బెదిరింపులకు బయపడి కొందరు తప్పుకుంటే.. మరి కొందరిపై అకారణంగా సస్పెన్షన్ వేటు వేస్తున్నారు.

ఉపాధి హామీ పథకం 'పచ్చ' మయం

ఉపాధి హామీ పథకం అధికార పార్టీ నేతలకు ఆదాయ వనరుగా మారిపోయింది. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల కనుసన్నల్లో పనులు జరుగుతున్నాయి. ఆ పార్టీ కార్యకర్తలే మేట్లు, ఫీల్డ్ అసిసెంట్లుగా వ్యవహరిస్తున్నారు. కూలీల కడుపులు కొట్టి తమ జేబులు నింపుకుంటున్నారు. వీరి అక్రమాలకు అడ్డుగా ఉన్నారని, తమకు అనుకూలంగా లేని ఫీల్డ్ అసిసెంట్లను తొలగించి టీడీపీ కార్యకర్తలను పెట్టి పనులు జరుపుకుంటున్నారు. తమ ఉద్యోగాలు తమకు కావాలని పోరాడుతున్న వారిపై కేసులు పెట్టమని, భారీగా రికవరీలు చేయమని సిఫార్సులు చేస్తూ మరింతగా వేధిస్తున్నారు. ఈ రకంగా వేధింపులు బెదిరింపుల్లో కావలి ప్రజాప్రతినిధి ప్రథమ స్థానంలో ఉన్నారని జిల్లా ఉపాధి హామీ కార్యాలయంలో చర్చ నడుస్తోంది. 'నేను చెప్పినట్లు చేస్తారా.. మిమ్మల్ని ఊడగొట్టించమంటారా? అంటూ తమనే బెదిరిస్తూ, ఒత్తిడి పెంచుతున్నట్లు అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఉపాధి పథకం అధికారులకు ప్రజాప్రతినిధి ఆదేశాలు



కావలిలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

రాజీనామా చేసి వెళ్లిపోండి

కొందరు తమ ఉద్యోగాలు తీయొద్దని, కోర్టు ఉత్తర్వుల ప్రకారం కొనసాగించాలని సదరు ప్రజాప్రతినిధిని కలిసి గోడు వెళ్లబోసుకున్నప్పటికీ కనీసం కనికరం లేకుండా.. రాజీనామా చేసి వెళ్లిపోండి.. లేదంటే రూ.లక్షల్లో రికవరీలు వేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. బెయిల్ కూడా రాకుండా చేస్తామంటూ బెదిరింపులకు దిగారని సదరు ఎఫ్‌ఏలు కన్నీటి పర్యంతమయ్యారు. దగదర్తి మండలానికి చెందిన వాణి, రేవతి భర్తలు ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ క్షేత్రస్థాయిలో గుండె నొప్పితో మరణించారు. గత ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆ స్థానాల్లో వారి భార్యలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించడంతో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇటువంటి వారితోపాటు ఈ మండలంలో 11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. జీవనోపాధి కోల్పోయి అవస్థలు పడుతున్నారు.

భారీగా రికవరీలు విధించమని హుకుం

కూటమి అధికారంలోకి రాగానే కావలి మండలంలో 17 పంచాయతీల్లో టీడీపీకి అనుకూలంగా ఉండే వ్యక్తులను ఎఫ్‌ఏలుగా నియమించారు. ఇది నచ్చని పది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు కోర్టును ఆశ్రయించి అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకుంటే వారిపై వేధింపులు ప్రారంభించారు. సోషల్ ఆడిట్ సిబ్బందిని ప్రజాప్రతినిధి తన ఇంటికి పిలిపించుకుని ఆయా పంచాయతీల్లో భారీగా రికవరీలు వేయమని ఆదేశించినట్లు సమాచారం. సదరు ప్రజాప్రతినిధికి అనుకూలంగా వ్యవహరిస్తూ, కూటమి ప్రభుత్వానికి జైకొట్టిన కొందరు ఎఫ్‌ఏలకు 'జీరో' రికవరీలకు ఆదేశించారు. గౌరవరం, అన్నగారిపాళెం పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అధిక శాతం అవినీతి జరిగింది. పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు స్వాహా చేశారు. అయితే ఈ రెండు పంచాయతీల్లో ఎఫ్‌ఏలు కూటమికి అనుకూలం కావడంతో గౌరవరం ఎఫ్‌ఏకు రూ.2 వేలు, అన్నగారిపాళెం ఎఫ్‌ఏకు రూ.11 వేలు మాత్రమే రికవరీ విధించారు. సర్వాయపాళెం ఎఫ్‌ఏ కోర్టును ఆశ్రయించి ఉద్యోగం కావాలని ప్రయత్నం చేయడంతో ఆయనపై రూ.4 లక్షల రికవరీ విధించారు. సర్వాయపాళెం పంచాయతీలో తల్లికి జాబ్ కార్డు ఉండడం, పనులు కొడుకు చేయడం, భార్యకు జాబ్‌కార్డు ఉంటే భర్త పనులు చేయడం తదితర పొరపాట్లు జరిగాయి. ఆయా పొరపాట్లకు సంబంధించి గ్రామ సభలో పనులు మేమే చేశాం. మా అకౌంట్లలోనే నగదు జమ అయిందంటూ సభ్యులు స్పష్టం చేశారు. రాత పూర్వకంగా అధికారులకు తెలియజేశారు. అయినా ప్రజాప్రతినిధి చెప్పాడని, ఆయన ఆదేశాల ప్రకారం రూ. 4 లక్షలకు పైగా రికవరీ విధించారు. మంగళవారం కావలి ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఆ మండలానికి సంబంధించి సోషల్ ఆడిట్‌లో అధికారులు సైతం స్థానిక ప్రజాప్రతినిధి చెప్పినట్లు వ్యవహరించినట్లు సమాచారం. పెద్దపట్టపుపాళెం ఎఫ్‌ఏ గ్రామసభలో ఎటువంటి రికవరీలు పడలేదు. దీంతో 'పనులు కల్పించాలంటే రూ.300 లంచం అడిగాడంటూ' ఆకాశ రామన్న ఉత్తరంతో అతనిపై చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

నలుగురు రాజీనామా.. ఆరుగురి సస్పెన్షన్

ప్రజాప్రతినిధి బెదిరింపులతో కావలి మండలంలో కోర్టును ఆశ్రయించిన ఎఫ్‌ఏల్లో నలుగురు రాజీనామా చేశారు. సోషల్ ఆడిట్‌లో అవినీతిని చూపించి ఆరుగురిని సస్పెండ్ చేస్తూ డ్వామా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సోషల్ ఆడిట్ జరిగిన మండలాలు పరిశీలిస్తే రాపూరు మండలం రూ.1.30 కోట్లు, సైదాపురం రూ.70 లక్షలు, కలిగిరి రూ.50 లక్షలు, కొండాపురం రూ.60 లక్షలకు పైగా రికవరీలు విధించారు. ఆయా మండలాల్లో సిబ్బందిని ఇప్పటి వరకు సస్పెండ్ చేయలేదు. వారంతా యథావిధిగా విధుల్లో కొనసాగుతున్నారు. కావలి మండలానికి సంబంధించి కోర్టును ఆశ్రయించారనే అక్కసుతో ఆరుగురు ఎఫ్‌ఏలను సస్పెండ్ చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. వాస్తవానికి కావలి మండలంలో రూ.12 లక్షల రికవరీలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా ఉద్దేశ పూర్వకంగా విధించినవే కావడం గమనార్హం.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు వేధింపులు

కావలి: ఉపాధి హామీ పథకంలో ఏన్నో ఏళ్లుగా చిరు ఉద్యోగాలతో కుటుంబాలను పోషించుకుంటున్న ఎఫ్‌ఏలపై కూటమి నేతల వేధింపులు పతాక స్థాయికి చేరాయి. ఆయా స్థానాల్లో టీడీపీ నేతలను నియమించేందుకు అధికారులు నోటి మాటగా అధికారికంగా ఫైల్‌ను తయారు చేసి ఇప్పటికే ఉద్యోగాల నుంచి తొలగించారు. కోర్టు ఆదేశాలంటూ పోరాడుతున్న ఎఫ్‌ఏలపై అవినీతి ఆరోపణలతో రికవరీలతో ఇబ్బందులు పెడుతున్నారు. అందులో భాగంగానే కావలి మండలంలో సర్వాయపాళెం, రుద్రకోట, అడవిలక్ష్మీపురం, తుమ్మలపెంట, పెద్దపట్టపుపాళెం ఐదుగురు ఎఫ్‌ఏలను తొలగించారు. ఇక ఆముదాలదిన్నె ఎఫ్‌ఏ విషయంలో టీడీపీ నేతలు జోక్యం చేసుకుని తమ వాడని చెప్పడంతో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీస్ ఇచ్చి సరిపెట్టారు. తొలగించిన ఎఫ్‌ఏలు అందరూ కూడా 15, 10 ఏళ్ల నుంచి నెలకు రూ.10 వేలు మాత్రమే జీతంగా తీసుకుంటూ పని చేస్తున్నారు. వీరిని తొలగించడానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ గంగాభవాని మంగళవారం ఏకంగా కావలి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు, పనుల కొలతల్లో తేడాలకు సంబంధించి రూ.11,37,684 అవినీతి జరిగిందని ప్రకటించారు. జరిగిన నష్టం నగదును తొలగించిన ఎఫ్‌ఏల నుంచి వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ ప్రకటించారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

సోషల్ ఆడిట్‌లో రికవరీలు పడిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నాం. రూ.లక్షల్లో రికవరీలు ఉన్న సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. ఆ ప్రకారం అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. రికవరీలకు సంబంధించి ఎఫ్‌ఏలు తమ వద్ద ఉన్న వివరాలను డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్, ఉన్నతాధికారులకు చూపించి తగ్గించుకునే అవకాశం ఉంది.

\- గంగాభవాని, డ్వామా పీడీ

కూటమి దెబ్బకు కదిలిన కమిషనర్ కూసాలు

- బుచ్చి అభివృద్ధిలో తనదైన మార్కు చూపించిన కమిషనర్
- ఆక్రమణల తొలగింపును అడ్డుకునేందుకే ఆకస్మిక బదిలీ
- చక్రం తిప్పిన రియల్ ఎస్టేట్, వ్యాపారులు
- పట్టణానికి శాపంగా మారనున్న ఈ పరిణామం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆకస్మికంగా బదిలీ కావడం స్థానికంగా చర్చకు దారి తీసింది. మరో ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన్ను తప్పించడం వెనుక అధికార పార్టీ రాజకీయ కుట్రలు ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న పట్టణానికి ఆక్రమణలు శాపం కాకూడదని భావించిన కమిషనర్ ప్రధాన రహదారుల్లో వాటిని తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ ఆక్రమణలు తొలగించకుండా అడ్డుకునేందుకే ఆయన్ను ఆకస్మికంగా బదిలీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే కోటరీగా వ్యవహరిస్తున్న వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పావులు కదిపి కమిషనర్ కూసాలు కదిలించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తామనుకున్న లక్ష్యంలో భాగంగా ఆయన్ను బదిలీ చేశామని జబ్బలు చరుచుకున్నా.. ఇది బుచ్చి పట్టణానికి భవిష్యత్‌లో పెను శాపంగా మారే అవకాశాలు ఉన్నాయి. మేజర్ పంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీ హోదా సంతరించుకున్న బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రధాన రహదారులు ఇప్పటికీ ఇరుకుగా ఉన్నాయి. భవిష్యత్‌లో గ్రేడ్–1 మున్సిపాలిటీ అవతరించే స్థాయిలో పట్టణం విస్తరిస్తోంది. ఇదే సమయంలో రహదారులు విస్తరించాల్సిన అవసరం ఉంది. ఇప్పుడే ఆక్రమణలు తొలగిస్తే.. భవిష్యత్ కాలంలో పట్టణం అభివృద్ధి దిశగా అడుగులు పడుతాయి. లేదంటే ఎక్కడవేసిన గొంగడి అక్కడే ఉన్నట్లుగా మారుతుంది.

సమస్యాత్మకంగా మారిన ఆక్రమణలు

బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్ నుంచి చెన్నూరు రోడ్డు వరకు ఆక్రమణలు అత్యంత సమస్యాత్మకంగా మారాయి. ఈ క్రమంలో ఇటీవల కమిషనర్ చంద్రశేఖరరెడ్డి పట్టణాభివృద్ధిని కాంక్షించి రోడ్డును ఆక్రమించిన వ్యాపారులను తొలగించేందుకు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు లోకాయుక్తను ఆశ్రయించారు. లోకాయుక్త ఇచ్చిన నోటీసులను కొంత మంది రియల్టర్లకు కమిషనర్ జారీ చేసినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచే కమిషనర్ బదిలీ అంటూ ప్రచారం జరిగినప్పటికీ పలు ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగింది. నూతనంగా నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌కు వెళ్లే రోడ్డులో నీటిపారుదల శాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించి కొందరు వ్యాపారులు పక్కాగా షాపులు నిర్మించి నిర్వహిస్తున్నారు. వాటిని కూడా తొలగిస్తే చెన్నూరు రోడ్డు నుంచి మార్కెట్‌కు, బైపాస్ రోడ్డు వరకు రహదారి విశాలంగా ఉంటుందనే ఆలోచనతో కమిషనర్ కొంత మేర కొలతలు కూడా తీశారు. ఆ స్థలం నీటి పారుదల శాఖకు చెందినది కావడంతో ఆ శాఖ జిల్లా ఎస్ఈ, ఈఈలకు కమిషనర్ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రూ.కోట్ల విలువైన ఆ స్థలాలను వదులు కునేందుకు ఇష్టపడని వ్యాపారులు పైరవీలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఆకస్మికంగా కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డిని రాష్ట్ర పురపాలక శాఖా కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు అందాయి. ఆ స్థానంలో నెల్లూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డబ్బుగుంట బాలకృష్ణను నియమిస్తూ ఆదేశాలు సైతం వచ్చాయి. ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులను బదిలీలు చేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఆయన బదిలీ జరగడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా ఆయన బదిలీ వెనుక ఎమ్మెల్యే కోటరీ శక్తులు బలంగా పని చేసినట్లు సమాచారం. కమిషనర్ బదిలీ విషయం తెలుసుకుని కలకలం రేగడంతో, నష్ట నివారణ చర్యల్లో భాగంగా బుధవారం బుచ్చిరెడ్డిపాళెం వచ్చిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రోడ్డు మార్జిన్ నుంచి తొలగించిన చిరు వ్యాపారులకు భరోసా ఇచ్చారు. ఆక్రమణలను తొలగింపును అడ్డుకునేందుకు చర్యలు తాత్కాలికంగా ఉపశమనం కలిగించవచ్చు కానీ, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ అభివృద్ధికి ఆదిలోనే హంసపాదు పడినట్లుగా అయింది.

కోలాహలం.. ఛత్రపతి జయంత్యుత్సవం



ట్రంకురోడ్డులో భారీ ప్రదర్శన



ట్రంకురోడ్డులో కోలాహలం

నెల్లూరు (బృందావనం): దేశభక్తిని చాటుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నగరంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవ ర్యాలీ బుధవారం కోలాహలంగా సాగింది. శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ 496వ జయంతిని పురస్కరించుకుని హిందూ ధార్మిక సంస్థలు, పార్టీలకతీతంగా పలువురు పాల్గొన్నారు. కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న శివాజీ జయంతి వేడుకలకు ప్రజలు భారీగా తరలిరావడంతో నగరంలో కోలాహల వాతావరణం కనిపించింది. వక్తలు మాట్లాడుతూ భరతమాత ముద్దు బిడ్డ ఛత్రపతి శివాజీ అని, దేశానికి ఆయన వరమని, ఆయన త్యాగనిరతిని దేశం ఎన్నటికీ మరువదన్నారు. యువత ఛత్రపతి భావజాలాన్ని, శౌర్యాన్ని నింపుకుని ముందుకు సాగితే దేశం సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. యువతకు ఛత్రపతి మార్గదర్శకుడన్నారు. దేశం కోసం, హైందవ ధర్మం కోసం శివాజీ మహరాజ్ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

కోలాహలంగా ప్రదర్శన

ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంత్యుత్సవ ర్యాలీ స్థానిక మద్రాస్ బస్టాండ్ దగ్గర ఉన్న వైఎంసీఏ మైదానం నుంచి బయలుదేరి వీఆర్సీ, గాంధీబొమ్మ, శివాజీ సెంటర్, ఏసీ సెంటర్, నర్తకి సెంటర్, కనకమహల్, కొత్తహాల్ సెంటర్, సండే మార్కెట్ సెంటర్ మీదుగా వైఎంసీఏ మైదానానికి చేరింది. అశ్వంపై అధిరోహించిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ప్రత్యేక ఆకర్షణగా అశ్వంపై తీర్చిదిద్దిన ఛత్రపతి శివాజీ విగ్రహం

జీబీఎస్ కలకలం

- అరవపాళెంలోముమ్మరంగా పారిశుధ్య పనులు

సంగం: మండలంలోని అరవపాళెంలో గులియన్ బారె సిండ్రోమ్ (జీబీఎస్) కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జీబీఎస్ లక్షణాలతో మంగళవారం నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. అతనికి అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన వైద్యాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ సర్పంచ్, అధికారులు అరవపాళెంతోపాటు పుట్టువారిగుంట గ్రామాల్లో బుధవారం ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే, శానిటేషన్, వాటర్ ట్యాంక్ క్లోరినేషన్, వాటర్ టెస్టింగ్‌లను నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసులరెడ్డి ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించారు. జ్వరం, దగ్గు, వాంతులు, విరోచనాలు, జలుబు ఈ వ్యాధి లక్షణాలని, వ్యాధి వచ్చి తగ్గిన తర్వాత తిమ్మిర్లు, నరాల బలహీనత, కండరాల నొప్పులు వస్తాయన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. జీబీఎస్ అంటువ్యాధి కాదని, వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటే ప్రాణాపాయం ఉంటుందని, ఈ వ్యాధి వల్ల రోగ నిరోధక శక్తి తగ్గి శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయని డాక్టర్ అశోక్ తెలిపారు.



అరవపాళెంలో పర్యటిస్తున్న అధికారుల బృందం

ఇన్సులిన్‌కూ కటకటే..!

పీహెచ్‌సీలకు ఐదు నెలలుగా నిలిచిన సరఫరా

- ఆన్‌లైన్లో ఇండెంట్ కాలమే ఎత్తివేత
- ప్రజారోగ్యాన్ని విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని కూటమి ప్రభుత్వం తరచూ ఊదరగొడుతున్నా, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అదంతా ఒట్టిదేనని తేలిపోతోంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఆధారపడే ఇన్సులిన్ వైల్స్ సరఫరాలో నిర్లక్ష్య ధోరణిని కనబరుస్తోంది. పీహెచ్‌సీలకు ఐదు నెలలుగా వీటి సరఫరా నిలిచిపోయిందంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇదే విషయాన్ని సిబ్బందే నిర్ధారిస్తుండటం గమనార్హం.

ఆత్మకూరు: ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని కనబరుస్తోంది. పెద్దాస్పత్రి, పీహెచ్‌సీలకు ఇన్సులిన్ వైల్స్ ఐదు నెలలుగా సరఫరా కావడం లేదు. వాస్తవానికి షుగర్ వ్యాధి తీవ్రమైతే దీన్ని వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వీటికి సంబంధించిన మందులు ఖరీదు కావడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వాస్పత్రులపై ఎక్కువగా ఆధారపడుతుంటారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. దీంతో జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లోని ఆస్పత్రులకు అన్ని రకాల మందులు సక్రమంగా సరఫరా అయ్యేవి. ఇన్సులిన్ వైల్స్ తగినంత అందుబాటులో ఉండేవి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో అర్బన్ హెల్త్ కేంద్రాలు 25, పీహెచ్‌సీలు 52 ఉన్నాయి. నెల్లూరులో జీజీహెచ్, ఆత్మకూరులో ప్రభుత్వ జిల్లా వైద్య కేంద్రం, కావలి, కందుకూరులో ప్రాంతీయ వైద్య కేంద్రాలు, ఉదయగిరి, వింజమూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు, కోవూరు, రాపూరు ప్రాంతాల్లో సీహెచ్‌సీలున్నాయి. వీటికి మందులు ఏపీఎంఐడీఎస్ నుంచి సరఫరా అవ్వాలి. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు చేరితే అక్కడి నుంచి మండలాలకు సరఫరా చేస్తారు. అయితే ఇటీవలి కాలంలో పీహెచ్‌సీలకు మందుల సరఫరాను తగ్గించారని సమాచారం.

మందుల సరఫరా ఇలా..

వివిధ రోగాలకు సంబంధించిన మందులను ఏడాదిలో నాలుగుసార్లు సరఫరా చేస్తారు. పేషెంట్ల తాకిడిని బట్టి ఒక్కో పీహెచ్‌సీకి రూ.50 వేల నుంచి రూ.3.5 లక్షల విలువగల 84 రకాల నుంచి 172 రకాల మందులు సరఫరా అవుతాయి. ఏరియా, జీజీహెచ్ లాంటి కేంద్రాలకు రూ.15 లక్షల విలువగల మందులను సరఫరా చేస్తారు.

ఆన్‌లైన్లోనే ఇండెంట్ ప్రక్రియ

ఆయా పీహెచ్‌సీల పరిధిలోని షుగర్ పేషెంట్ల వివరాల మేరకు.. గతంలో పంపిణీ చేసిన షుగర్ వైల్స్‌ను దృష్టిలో ఉంచుకొని కావాల్సిన మేరకు ఇండెంట్‌ను ఫార్మసిస్ట్‌లు పెడతారు. ఇలా ఒక్కో పీహెచ్‌సీ కేంద్రంలో 300 నుంచి 500 వరకు షుగర్ వైల్స్‌ను ఇండెంట్‌లో నమోదు చేస్తారు. ఈ వ్యవహారమంతా ఆన్‌లైన్ ద్వారానే జరగాల్సి ఉంది. ఒక్కో వైల్‌లో 10 ఎమ్మెల్ ఇన్సులిన్ ఉంటుంది. వైల్స్‌లోనూ 30 / 70.. 40 ఐయూ ఇలా రెండు రకాలుంటాయి. అయితే ఇండెంట్‌లో ఇన్సులిన్ అనే కాలమ్‌ను తాజాగా ఎత్తేశారని సమాచారం. దీంతో రానున్న త్రైమాసికంలో దీని సరఫరా నిలిచిపోనుందని తెలుస్తోంది. కొన్ని పీహెచ్‌సీల్లో వైల్స్ పూర్తవ్వడంతో సమీప కేంద్రాల నుంచి తెచ్చుకొని అందజేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది పేర్కొంటున్నారు.



ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో నిల్వ ఉన్న మందులు

కొనుగోలు భారం

పీహెచ్‌సీల్లో వైల్స్ కొరత కారణంగా రోగులు బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ఇన్సులిన్ 10 ఎమ్మెల్‌ను రూ.150 నుంచి రూ.170 వరకు విక్రయిస్తున్నారు. వీటి సరఫరాను పునరుద్ధరించాలని రోగులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీని సంప్రదించగా, ఫార్మసిస్ట్‌లు నమోదు చేసే ఇండెంట్ మేరకు సరఫరా అవుతోందని చెప్పారు. ఈ త్రైమాసికంలో ఇన్సులిన్ సరఫరా కాని విషయాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తానని బదులిచ్చారు.



ఇన్సులిన్ వైల్

ప్రైవేట్‌గా కొనుగోలు చేసుకోవచ్చు

ఆస్పత్రిలో ఇన్సులిన్ వైల్స్ తగినంత ఉన్నాయి. అవకాశం బట్టి ప్రైవేట్‌గా కొనుగోలు చేయొచ్చు. అయితే ఇప్పటి వరకు ఆ పరిస్థితే రాలేదు. ఫార్మసిస్ట్‌లు నమోదు చేసే ఆన్‌లైన్ కాలమ్‌ను పరిశీలిస్తా. పంపిణీలో ఇబ్బందుల్లేకుండా చూస్తా.

– శేషారత్నం, ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్



సంకల్పం ముందు ఓడిన వైకల్యం

అన్నీ సక్రమంగా ఉన్నా, ఈ రోజుల్లో ఏ పనీ చేసేందుకు కొందరు ఆసక్తి చూపరు. అలాంటిది తన రెండు అరచేతుల్లేకపోయినా, ఏ మాత్రం వెనుకంజ వేయకుండా భక్తవత్సలనగర్‌కు చెందిన శ్రీను ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ నిత్యావసర సరుకులను ఇంటింటికీ చేరవేస్తున్నారు. వైకల్యం తన లక్ష్యాన్ని ఏ మాత్రం అడ్డుకోదని నిరూపిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	100
లేయర్ (లైవ్)	75
బ్రాయిలర్ చికెన్	184
బ్రాయిలర్ స్కిన్‌లెస్	206
లేయర్ చికెన్	127

నిమ్మ ధరలు



పెద్దవి	రూ.47
సన్నవి	రూ.30
పండ్లు	రూ.10

క్లుప్తంగా

వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): పాతకక్షలను మనస్సులో పెట్టుకొని వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడ్ని గంటల వ్యవధిలోనే నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రాయపుపాళెంలో చికెన్ పకోడా దుకాణాన్ని నిర్వహిస్తున్న ఏసీనగర్‌కు చెందిన పఠాన్ మౌలాలీ వద్దకు అదే ప్రాంతానికి చెందిన గంగాధర్ 20 రోజుల క్రితం వెళ్లారు. చికెన్ పకోడా ఇవ్వాలని కోరగా, అందజేయడంలో ఆలస్యమైంది. దీంతో ఆగ్రహానికి గురైన గంగాధర్.. దుకాణంలో ఉన్న చికెన్ పకోడాను కిందపడేశారు. దీంతో వీరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాయపుపాళెం – రామచంద్రాపురం జంక్షన్లో గంగాధర్‌పై మౌలాలీ కత్తితో మంగళవారం రాత్రి దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడి కోసం ఎస్సై రెహమాన్ గాలింపు చర్యలు చేపట్టారు. ప్రశాంతినగర్ జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

కావలి: పట్టణంలోని ముసునూరులో గల ఓ ఇంట్లో ఏసీ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం మంగళవారం రాత్రి సంభవించింది. దీంతో భయాందోళనలకు గురైన కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. మంటలతో ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పింది. 15 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.ఐదు లక్షల నగదు కాలిబూడిదైందని బాధితుడు నరసయ్య వాపోయారు. బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

ఉపాధి హామీ వ్యవస్థను దెబ్బతీయొద్దు



మాట్లాడుతున్న గంగాభవాని

నెల్లూరు (పొగతోట): క్షేత్రస్థాయిలో వివిధ రకాల ఒత్తిళ్లు, బెదిరింపులు ఉండొచ్చని, దీనికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వ్యవస్థను దెబ్బతీయొద్దని డ్వామా పీడీ గంగాభవాని పేర్కొన్నారు. నగరంలోని డ్వామా కార్యాలయంలో క్లస్టర్ ఏపీడీలు, ఏపీఓలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒత్తిళ్లను అధిగమించి పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అందరూ అనుభవమున్న అధికారులేనని, సమస్యలను అధిగమించి పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని పేర్కొన్నారు. పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను లక్షకు పెంచాలని ఆదేశించారు.

ఆర్బీకేలో జేసీ పరిశీలన



వివరాలను ఆరాతీస్తున్న కార్తీక్

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాలలో గల రైతు భరోసా కేంద్రాన్ని జేసీ కార్తీక్ బుధవారం పరిశీలించారు. పరికరాలను పరిశీలించి రైతులతో ముచ్చటించి వారి సమస్యలను ఆరాతీశారు. ధాన్యం మద్దతు ధరతో పాటు తేమ శాతంలో సడలింపులిచ్చి గోడౌన్లను ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. రైతులు తెలియజేసిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పాతకక్షలతో మహిళ ఇంటికి నిప్పు

పొదలకూరు: పాతకక్షలను దృష్టిలో ఉంచుకొని పూరింటికి ఓ వ్యక్తి నిప్పుపెట్టిన ఘటన మండలంలోని బిరదవోలులో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలో పూరింట్లో నివాసం ఉంటున్న కై తేపల్లి లక్ష్మమ్మకు అదే గ్రామానికి చెందిన రంగయ్య కుటుంబానికి మధ్య విభేదాలున్నాయి. ఈ తరుణంలో లక్ష్మమ్మ తన కుమార్తెతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా, రంగయ్య నిప్పు పెట్టారు. మంటలు వ్యాపించడంతో లక్ష్మమ్మ, ఆమె కుమార్తె బయటకు పరుగులు తీశారు. గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై హనీఫ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారని సమాచారం.

పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు(అర్బన్): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నామని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల పెండింగ్ సమస్యలు, డీఆర్ బకాయిలు తదితరాలపై చర్చించనున్నామని, సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

విద్యారంగాన్ని సర్వనాశనం చేశారు

- కూటమి ప్రభుత్వంపై మండిపడిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. డైకస్‌రోడ్డులోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. గత సీఎం జగన్ మోహన్‌రెడ్డి హయాంలో విద్యా వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యమిచ్చిన అంశాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు – నేడు కింద తీర్చిదిద్దడంతో బడిబాట పట్టే పిల్లల సంఖ్యా పెరిగిందని చెప్పారు. వీటిని చూసి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఇస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారని, అయితే ఇప్పుడు డేటా అవసరమంటూ ఆ విషయాన్ని దాటేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వృద్ధి రేటు 15 శాతానికి చేరితేనే అన్ని పథకాలను అమలు చేస్తామంటున్నారని, అవి అందే పరిస్థితి లేదనే విషయం దీని ద్వారా అర్థమవుతోందని చెప్పారు. పిల్లల చదువుకు గండికొట్టడం సరికాదని హితవు పలికారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎందుకు ఇవ్వాలనే ధోరణిలో మంత్రి లోకేశ్ ఉన్నారన్నారు. 2019 నాటికి అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇవ్వాల్సిన దాదాపు రూ.రెండు వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చెల్లించిందని తెలిపారు. పాఠశాల.. కళాశాల విద్యను అనుసంధానం చేసేందుకు బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌ను ఏర్పాటు చేశారని, ఈ కారణంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. విద్యారంగాన్ని ప్రస్తుతం భ్రష్టు పట్టిస్తున్నారని, విద్యార్థుల్లేకుండా విజన్ – 2047ను ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నాలుగు విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాల్సి ఉందని, ఒక్క విడతా.. అదీ పూర్తి స్థాయిలో ఇవ్వలేదని ఆరోపించారు. ప్రైవేట్ రంగానికి లబ్ధి చేకూరుస్తారే తప్ప ప్రజలకు ఉపయోగపడే ఏ పనినీ చంద్రబాబు చేయరని ధ్వజమెత్తారు. హెరిటేజ్ లాభాల్లో ఉండగా, ప్రభుత్వ రంగానికి చెందిన విజయ డెయిరీ నష్టాల్లో ఉందనే అంశాన్ని దీనికి ఉదాహరణగా చూపారు.

నూతన సాంకేతికతను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న సునీత

వెంకటాచలం: ఆర్థిక స్థిరత్వం, గ్రామీణ స్వయంప్రతిపత్తి కోసం నూతన సాంకేతికతలు, వ్యవసాయ పద్ధతులు, గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు కోరారు. సుస్థిర జీవనోపాధులవైపు నూతన మార్గదర్శనలు, గ్రామీణ వృత్తుల విభజన అనే అంశంపై కాకుటూరు సమీపంలోని వర్సిటీలో జాతీయ సదస్సును బుధవారం నిర్వహించారు. గూగుల్ మీట్ ద్వారా వర్చువల్ విధానంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి కోసం కొత్త అవకాశాలను గుర్తించి, వాటి అమలు దిశగా ఈ సదస్సు ఎంతో ఉపయోగకరంగా మారనుందని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఆంకాలజీ ప్రొఫెసర్ రఘునాథరావు, డాక్టర్ మహేష్ పవన్, వీఎస్‌యూ ప్రిన్సిపల్ విజయ తదితరులు పాల్గొన్నారు.

మితిమీరుతున్న టీడీపీ దౌర్జన్యాలు

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



లక్ష్మణరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కాకాణి

పొదలకూరు: టీడీపీ నేతలు, కార్యకర్తల దౌర్జన్యాలు మితిమీరిపోయాయనే విషయాన్ని ఎక్కడికెళ్లినా ప్రజలు తెలియజేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు, వెంకటాచలం మండలాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల వద్ద పొలాలను కొనుగోలు చేసి జగనన్న కాలనీలను నిర్మిస్తే, టీడీపీ మూకలు దౌర్జన్యం చేసి ఆక్రమిస్తున్నారని బాధితులు వాపోతున్నారని తెలిపారు. ఆక్రమించిన వారు ఇల్లు కట్టుకున్నా, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే అసలైన లబ్ధిదారులకు అప్పగిస్తామని చెప్పారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభించడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ఎదురయ్యే ప్రతి సమస్యపై పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి స్పందించి ప్రజలకు అండగా పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, పేదలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘన నివాళి

కల్యాణపురానికి చెందిన పార్టీ నేత లక్ష్మణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. పట్టణంలోని యాదవవీధికి చెందిన నాయీబ్రాహ్మణ సేవా సంఘ నాయకుడు బెల్లకొండ కాళిదాస్ తల్లి ఇటీవల మృతి చెందడంతో పరామర్శించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నరసాపురం సుబ్బయ్య ఇటీవల మృతి చెందడంతో నివాళులర్పించారు. బిరదవోలు ఎంపీటీసీ రావుల దశరథరామయ్యగౌడ్, వెన్నపూస దయాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యనాదిరెడ్డి, ఆకుల గంగిరెడ్డి, మాలపాటి రమణారెడ్డి, లక్ష్మయ్య, మద్దిరెడ్డి రమణారెడ్డి, బెల్లంకొండ ప్రసాద్, తుమ్మల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ల దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మర్రిపాడు: రెండు పొగాకు బ్యారన్లు అగ్నికి ఆహుతైన ఘటన మండలంలోని నందవరం కూడలి వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పరిమి వెంకటరమణమ్మ, కాకర్ల వెంకటేశ్వర్లు, హజరత్తయ్యకు చెందిన రెండు బ్యారన్లలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న మర్రిపాడు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో సుమారు రూ.తొమ్మిది లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

గురుకులాల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025 – 26 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి నుంచి ఐఐటీ, నీట్ అకాడమీలో ప్రవేశానికి బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్త పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు సెప్టెంబర్ ఒకటి, 2012 నుంచి ఆగస్టు 31, 2016 మధ్య.. బీసీ, ఓసీ విద్యార్థినులు సెప్టెంబర్ ఒకటి, 2014 నుంచి ఆగస్టు 31, 2016 మధ్య జన్మించి ఉండాలని చెప్పారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోరే వారు 2024 – 25 విద్యా సంవత్సరంలో పదో తరగతిని రెగ్యులర్ ప్రాతిపదికన చదివి ఉండాలని వివరించారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించి ఉండకూడదని తెలిపారు. apbragcet.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల ఆరో తేదీ సాయంత్రం ఐదు తర్వాత దరఖాస్తులను స్వీకరించబోమన్నారు. వివరాలకు 97045 50083, 97045 50096 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■ **Last Chance:** 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/lateral entry. 9381287629 [T-2514]

REAL ESTATE

PLOT FOR SALE

■ నెల్లూరు, ఇస్కాన్ సిటీ, సి–బ్లాక్‌లో 50 అంకణములు (60×60 Size) వెస్ట్ ఫేస్ ప్లాట్ అమ్మబడును. సంప్రదించండి: 9391046354, 89190 66484. [NA-11229]

■ నెల్లూరు ముత్తుకూరు రోడ్డు బ్రహ్మదేవం దగ్గర ఆనంద్ విహార్ మెగా నూడా వెంచర్ ప్రారంభ సందర్భంగా ప్లాట్ కొన్నవారికి 200 గ్రా॥ వెండి & ఇల్లు కట్టుకునే వారికి 200 బస్తాల సిమెంటు ఫ్రీ, ఓపెనింగ్ 23/2/25 (ఉ॥ 10 కి), ph: 85230 59539. [SCA-25001730]

SERVICES

LOST

■ I, Kalapati Mallikarjun S/o. K Mohan Das, R/o.Hno.1-2-567/36, Kavadiguda, Hyd-80, Telangana, I Lost my Original Registered deed vide doc.no:861/2015, dated: 21-05-2015, Sub Registered Office Kovur, while taking photostat copies at Domalguda. If found Call: 9000790033 [HA-15147]

WANTED

■ **Wanted Female Computer Operator** Nellore Town. Qlf: Degree Freshers, Type Speed, Internet Knowledge. Contact: 9059892362. [NA-6829]

ప్రకటన గోరంత స్పందన కొండంత

■ **Wanted Teachers for Pre Primary,** Science, Social, Computer, Physics, Accountant, PROs, Marketing Persons. Nalanda oxford School, Near Manasa Theatre, Kavali. 99498 49758. [NA-6823]

■ Wanted Teachers 1st to 10th Class for all Subjects & PRO's for 2025-26 in AP/ TG. Attractive Salary. Contact Cell: 6309542331. [T-1235671]

■ రియల్ ఎస్టేట్‌లో పని చేయుటకు టీం లీడర్స్ (F/M), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్(F/M), ఫ్రీ లాన్సర్స్(F/M), ఫీమేల్ టెలికాలర్స్(F), ఇన్సెంటివ్స్ & శాలరీస్ సెల్. 92940 00044, 70135 07272. [NA-6828]

■ ధనలక్ష్మీ మార్కెటింగ్ ఏజెన్సీ, కనకమహల్ సెంటర్, విజయడైరీ ఎదురుగా, నెల్లూరు నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, Tally అనుభవం గల అకౌంటెంట్ కావలెను. 75692 34505. [NA-897]

■ శ్రీదుర్గ హోటల్ నందు పని చేయుటకు స్త్రీ, పు అనుభవం కలిగిన వారు నేపాల్ వారు కావలెను. వసతి ఫ్రీ. మంచి జీతం కలదు. వివరములకు సంప్రదించండి: 94411 46462. [N-1266744]

■ ఫోర్స్ కంపెనీ షోరూం నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మెకానిక్స్, హెల్పర్స్ కావలెను. బుజబుజనెల్లూరు–నెల్లూరు. Contact: 95812 99916, 94929 34103. [NA-808]

■ KCS జాబ్ సర్వీసెస్ నందు పని చేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. అర్హత: B.Com కంప్యూటర్స్, నెల్లూరు బిట్–2వారికి ప్రాధాన్యత. Age: 30సం॥లోపు. Cont: 93461 64219. [NA-804]

■ కావలి నలంద CBSE స్కూలులో పని చేయుటకు హిందీ, ఇంగ్లీషు, సోషల్ టీచర్లు, వార్డెన్స్ కావలెను. మంచి జీతం (నాన్ లోకల్ వారికి ఉచిత వసతి). 91210 94995, 99894 33348, 91210 24992. [N-1268153]

■ ప్రముఖ విద్యా సంస్థకు ఫీల్డ్ అనుభవం & టూ వీలర్ కలిగి సమర్థత గల PRO's & లేడీ టెలికాలర్స్ కావలెను. Cell: 9030030125 [T-1298]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663 [HA-1901]

CHANGE OF NAME

I, GULAMKIRUMANI ABDUL GHANI (Old Name), Resident of 3962, 4th Mile, Dorathopu Colony, Masjid E-Noor, Navalakula Gardens, Nellore-524002, SPSR Nellore Dt, AP. here by declare that I have changed my name as GULAMKIR MANI ABDUL GHANI (New Name). S/o.GULAMKIRMANI DASTAGIRI SAHEB (Late).

■ కస్టల్లేస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు – 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995365999 [HA-99864]

■ ఫైనాన్స్ కంపెనీ నందు నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, ఇందుకూరుపేట, కావలి, ముత్తుకూరుపేటలలో పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ & నెల్లూరు టౌన్‌లో Exp. కలిగి లేడీ టెలికాలర్స్ కావలెను. 9392915944, 9392915938 [HA-1161]

■ నెల్లూరు జిల్లా ముత్తుకూరు దగ్గర ప్రముఖ పవర్ ప్లాంట్ నందు పర్మినెంట్‌గా పని చేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ: 8గం॥. జీతం 18,500. Qlf: SSC. ఉచిత వసతి కలదు. సంప్ర: 77999 27609, 77997 08404. [NA-6831]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.